# అరుంధతి

పది సంవత్సరాల తరువాత ఆ కల్యాణ మంటపంలోకి ప్రవేశిస్తూండగా నా చెవిలో ప్రతిధ్వనించిన మాటలు "అరుంధతి కనిపించిందా ? అరుంధతి కనిపించిందా ? అరుంధతి కనిపించిందా ?"

పగటిపూట కనిపించని ఆ అరుంధతి నక్షత్రం కోసం అందరి ఆరాటం ఎందుకో నాకర్థం కాలేదు. ఆ తరువాత తెలిసింది వారి ఆరాటానికి అర్థం. పది సంవత్సరాలైనా నేను మరచిపోలేని మాటలని మరచిపోలేని ఉదంతమది.

పాతకాలపు సత్రంలోవున్న ఆ కల్యాణమంటపాన్ని నే తదేకంగా చూస్తుంటే విశ్వం నా భుజం ఊపుతూ "రా రా! ఏవిటలా నిలబడిపోయావు?" అంటూ లోపలకి లాక్కెళ్ళాడు.

విశాలమైన మండువాకి అటుఇటు విశాలమైన నాలుగు పెద్దగదులు-వాటి వెనుకస్నానపు గదులు. వెనుక విశాలమైన వంటశాల-ముందుభాగంలో వున్న హాలుకి సమాంతరంగా- అదే కల్యాణ మంటపం- ఏ మార్పు లేదు. మరమ్మతులు చేసిన గుర్తులు లేవు. పాతబడి అప్పటిలాగే వుంది.

"ఈ సత్రంలోకి పదేళ్లక్రితం వచ్చానొకసారి". అన్నాను విశ్వంతో.

"నీవు కబుర్లలోపడితే వందేళ్లయినా వెనక్కి వెళ్తావు. ముందు స్నానం చేసిరా. అలసట తీరుతుంది" అంటూ స్నానాల గదివైపు తీసుకెళ్లాడు.

ఆ వరండా అలాగే వుంది. ఈ పది సంవత్సరాల్లో ఒకసారి సున్నం వేశారేమో. అయినా వరండా గోడమీద 'జీడికిరాజెవరు?' అనే రాత అస్పష్టంగా కనిపిస్తూనేవుంది. స్నానాల గదులు కాటుక మరకలతో, స్టిక్కర్ బొట్లతో-ఏం మారలేదు.

స్నానంచేసి వచ్చేసరికి ఘుమఘుమలాడే వేడివేడి జీడిపప్పు ఉప్మా, మంచి నీళ్ళు, కాఫీ-మరదలుతో పట్టించుకువచ్చాడు విశ్వం.

"పది సంవత్సరాల క్రితం ఈ సత్రంలో ఏం జరిగిందో తెలుసా?" అని నే ప్రారంభిస్తూంటే, "నాయనా! అపర నన్నయ-కథాకథన చక్రవర్తి- నన్ను వదిలేయి నాయనా. నా చెల్లిపెళ్ళి చేసికుంటున్నాను. ఆ కార్యక్రమం అయ్యేంతవరకు నన్ను బాధించకు". చేతులు జోడించాడు విశ్వం.

"కాదురా విశ్వం నీవు ఈ ఊరివాడివి కాబట్టి చెప్తున్నాను. నీవు తప్ప నాకెవరు చెప్పలేరు. ఇక్కడికి ఈ పెళ్ళికి రావడం పెళ్ళి ఈ సత్రంలో జరుగుతోంది కాబట్టే..."

"ఉండయితే! వంటలెంతవరకు వచ్చాయో చూచివస్తాను". అంటూ జారుకున్నాడు.

శ్రీనివాసులుగారు తప్ప నాకు సహాయపడేవారెవరూ లేరని తెలిసింది. శ్రీనివాసులుగారు అయిదు సంవత్సరాల క్రితమే ఉద్యోగం మానేశారట. తరువాత

విశ్వమే చెప్పాడు. నిజానికి శ్రీనివాసులుగారే దామెర్ల రామారావు చిత్రకళపై పరిశోధన చేస్తూ- వారు చిత్రించిన చిత్రాలనే అభ్యసిస్తున్న నాకు ఈ సత్రంలో ఆశ్రయాన్ని కల్పించింది.

టిఫిన్ చేసి నెమ్మదిగా మేడమీదికి వెళ్ళాను. మేడమెట్లు మారలేదు. లంబరు రూములా వుండి, నెలరోజులపాటు నాకు ఆశ్రయం ఇచ్చిన దక్షిణ భాగాన వున్న ఆ గది ఖాళీగా వుంది. బయట తాళం పడివుంది. ఆ గదిలో ఓ ఇరవైరోజులు విరిగిన కుర్చీలు, బల్లల మధ్య గడిపాను. ఆ గదిలో ఓ పాత పందిరిమంచం -టేబిలు, కుర్చీ-నిలువుటద్దం. విరిగిన సొట్టపడ్డ మూకుడుతో పాటు నేను ఓ మూల కాన్వాస్‌ను స్టాండుమీద అమర్చుకుని చిత్రకళ సాగించేవాడిని. పగలల్లా ఆర్టుగ్యాలరీలో గడిపి-సాయంత్రాలు గోదావరి గట్టున-రాత్రి కేన్వాస్‌దగ్గర గడపటం-చిత్రకళపై విశ్లేషణా వ్యాసాలు రాసుకోవటం నా దినచర్య అయిపోయింది. ఏదో సమయంలో శ్రీనివాసులుగారు నా చిత్రాల్ని పరికించి వెళ్ళటం పరిపాటైపోయింది.

సత్రంలో పెళ్ళిళ్ళు జరిగే రోజుల్లో నా కాఫీ టిఫిను, భోజనం అక్కడే. ఇది శ్రీనివాసులుగారి ఆర్డరు. ఆయన మరి ఆ సత్రంలో మేనేజరు. దామెర్ల రామారావంటే వెర్రి అభిమానం.

కూల్డ్రే దొరను అంతగ ఆకర్షించిన దామెర్ల వారి చిత్రకళలోని ప్రత్యేకతను గమనించి తెలిసి కోటానికే తహతహలాడేవాడిని- ఒక్కోసారి రామారావు హృదయాన్ని స్పృశించిన స్త్రీ రూపం గోచర మవుతూంటే గోదావరి ఒడ్డున, గోదావరి బ్రిడ్జిక్రింద పడవలో కదులుతున్నట్టు కలగాంచేవాడిని.

ఒకరోజు ఓ సంఘటన జరిగింది. ఆ రోజున నేను గది తలుపులు మూసుకుని కేన్వాస్ ముందు అంతకుముందు నే గీచిన చిత్రానికి తుదిమెరుగులు దిద్దుతూంటే కిటికీ దగ్గర ఎవరో కదలినట్టయింది. తలతిప్పి చూచేసరికి ఎవరూ కనిపించ లేదు. నా పనిలో నిమగ్నమయ్యాను.

మరల కిటికీ దగ్గర పక్కనుండి ఎవరో చూస్తున్న అనుమానం. అనుమానానికి కారణం లేకపోలేదు. సన్నగ మ్రోగే మట్టిగాజుల ధ్వని, గదిలోకి కదలివచ్చే మల్లెల పరిమళాలు, బరువుగా సాగే ఉఛ్వాస నిశ్వాసాలు నాది అనుమానం కాదన్నాయి.

ఒక్కసారి తలతిప్పి చూశాను. గులాబిరేకుల్లో పొదగబడిన ఒక సంపెంగపువ్వుకి అటుఇటు పైభాగానరెక్కలు టపటపలాడిస్తున్న రెండు గండు తుమ్మెదలు-వాటిపై ప్రేమగ వంగినరెండు కాటుక కొండల రేఖలు. వానిమధ్య ఉదయించే అరుణవర్ణ సూర్యబింబం; సంపెంగకింద లయబద్ధంగా కదిలే రెండు చిన్న ఎర్రని దొండపండ్లు-నే చూడగానే అదృశ్యమై పరుగెత్తిపోతూ-

"ఛీ! అదాలా వుండదు". అంటూంటే గాజుల ధ్వని, మువ్వలపట్టీల ధ్వని ఆ వెనుకే వెళ్ళిపోయాయి. నే గబుక్కున తలుపులు తెరచి పరుగెత్తే వేగంతో వచ్చేసరికి మేడమెట్లు దిగి పారిపోతూ ఓసారి వెనుతిరిగి "అదలా వుండదు". అని మళ్ళీ అంటూ పరుగెత్తే ఆమె కనిపించింది. వెన్నెలననుసరించే చీకటిలా ఆమె పొడవైన జడ ఆమె

ననుసరిస్తూంటే నిశ్చేష్టుడనై నిలబడి పోయాను కొద్దిసేపు. గదిలోకి తిరిగివచ్చానే గాని కుంచె ముందుకి సాగలేదు.

ఈమె ఉద్దేశ్యం ఏమిటి? నా తప్పు ఎక్కడ? తదేకంగా చూడసాగాను. పట్టుమని పాతికేళ్ళు కూడా వుండని ఓ స్త్రీ మాటలను అంతగాపట్టించు కోనక్కర లేదేమో అంటూ కేన్వాస్‌ముందుకెళ్ళాను.

కానీ చెయ్యి కదలలేదు. "నా తప్పు ఎక్కడ?" బుర్ర పనిచేయలేదు. బట్టలు మార్చుకుని కిందికి దిగబోతూంటే శ్రీనివాసులుగారు ఎదురొచ్చి

"వారంరోజులుపాటు వరసగా పెళ్లిళ్లున్నాయి నీవు భోజనం కాఫీలకి ఎక్కడికీ వెళ్ళకూడదు. అన్నట్టు చిత్రం పూర్తయిందా?" అంటూ గదిలోకి దూసుకువచ్చారు.

ఆయన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి అభిమాని. కృష్ణ శాస్త్రిగారి 'ఊర్వశి'ని చిత్రించమంటారు. "ఆ పని వడ్డాది పాపయ్యగారే చేశారం" టాను.

"అబ్బే! అంతకన్నా అందంగా వుంటుంది ఊర్వశి". అంటారాయన.

"ఊహించగలిగే అందం రంభది. ఊహించ లేనంత అందం ఊర్వశిది. మరి అంతటి అందాన్ని చిత్రించటం ఎలా సాధ్యం?" అంటాను నేను. ఇద్దరం నవ్వుకుంటాం. చిత్రాన్నే చూస్తున్న శ్రీనివాసులుగారి చూపులనే చూడసాగాను.

"చాలా బాగుంది". అన్నారాయన.

"ఎక్కడైనా తప్పుగీసినట్టు మీకనిపిస్తున్నదా?" నెమ్మదిగా అడిగాను.

"లేదే! ఇటీజ్ పెర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్. అయినా ఆ మాట ఎందుకొచ్చింది?" అడిగారు.

నేనేమీ చెప్పక గదికి తాళం వేసి క్రిందికి దిగి వచ్చాను. గోదావరి ఒడ్డువైపు నడిచాను. నాచెవుల్లో ఆమె మాటలే ధ్వనించసాగాయి.

నా తప్పు ఎక్కడో, దానికి నివృత్తి ఏమిటో అని ఆలోచిస్తూనే శంకరమఠం దగ్గర కాసేపు కూర్చునిమరి కూర్చోలేక సత్రంకి తిరిగివచ్చేశాను. అప్పటికి మగపెళ్ళివారి భోజనాలవుతున్నాయి.

శ్రీనివాసులుగారు నన్ను ఆర్టిస్టుగా అందరికీ పరిచయం చేశారు. అది ఆయనకో సరదా. అందరితోపాటు భోజనానికి కూర్చోక తప్పలేదు నాకు.

అప్పుడు చూశానామెను. వడ్డన చేస్తూ నా ముందే తిరిగింది. కావాలనే "కూర కాస్త వడ్డించనా?... అన్నమో... కొద్దిగబూందీ..." అంటూపక్క వారికి విని పించనంత మెల్లగా-

"తెలియని విషయాలు తెలిసికోవాలి... అన్నీ తెలుసనుకోకూడదు - పచ్చడి కలుపుకోండి - కొబ్బరి పచ్చడి - నాట్యం తెలియనివాళ్ళునాట్యం గురించి మాటాడ కూడదు - రెండు పచ్చిమిరపకాయలు తేనా!" అంటూ ఎవరోపిలిస్తే అటు వెళ్ళిపోయింది.

అప్పుడు తలెత్తి చూశాను. ఆమె నడుస్తూంటే భామాకలాపానంతరం రంగస్థలం నుండి నిష్క్రమించే సత్యభామలా కనిపించింది. వర్ణన చేస్తూంటే చూశాను తదేకంగా. వర్ణనలో ఏదో నాట్యభంగిమ ప్రస్ఫుటమవుతూనేవుంది.

"ఎవరీ అమ్మాయి?" అడిగాను శ్రీనివాసులు గార్ని భోజనం తరువాత.

"వంటామె పార్వతమ్మ కూతురు. ఏదో మంచి పేరే. మంచి డాన్సర్. బి.ఏ. చదువుకుంది. నాట్య ప్రదర్శనలు అప్పుడప్పుడు ఇస్తూంటుంది. తల్లికి సాయంగా ఈ సత్రంలో జరిగే పెళ్ళిళ్ళకు వస్తూంటుంది. తండ్రి..." అని చెప్పబోతూంటే ఎవరో పిలిచారు. అతను వెళ్ళిపోయాడు.

ఎవరో అనామిక - ఓ సామాన్యురాలు మాటాడే మాటల్ని అంతగ పట్టించుకోకూడదని అనుకునే నేను ఆలోచనలో పడ్డాను. ఆమె విమర్శలో రీజన్ వుండితీరుతుంది. ఆమెనే అడిగి తెలుసుకోవాలని నిద్రకుపక్రమించాను.

ఉదయం 5 గంటలకే పెళ్ళి-రాత్రంతా పెళ్ళివారి సందడిలో నిద్ర సరిగా పట్టలేదు. ముహూర్తానికి ముందే లేచాను. కల్యాణమంటపం పరిసరాల్లో ఆమెకోసమే చూశాను. కనిపించలేదు. వీధివాకిలిలో నిలబడ్డాను కాసేపు.

ఇంతలో "కాఫీ తాగారా?" ఆమె గొంతుకే. వెనుతిరిగాను. ఆమే.

తడబడుతూ "లేదు లేదు". అన్నాను వెలుగు చీకట్ల మధ్య ఆమెను గుర్తుపట్టి.

"ఉండండి" అంటూ సర్రున వెళ్లింది.

మళ్ళీ అదే జడ. వెన్నెల ననుసరించే చీకటిలా. వెళ్ళినంత వేగంగా కాఫీ గ్లాసుతో తిరిగివచ్చింది "తీసికోండి". అంటూ,

గ్లాసు అందుకుంటూ-"ముందిది చెప్పండి. నా చిత్రంలో తప్పెక్కడుంది?" అడిగాను.

"మీ చిత్రాన్నే అడగండి". అంటూ పోబోయింది. వాకిలిలో ఎవరూ అంతగ లేరు. అంతా పెళ్ళిసందడిలో వున్నారు. నాకదే అవకాశం అనిపించింది.

"కాదు. అన్నది మీరు. చెప్పాల్సినదీ మీరే". అన్నాను.

"నేనేం చెప్పగలను. ముందుగ మీరొక మోడల్ని సంపాదించుకోండి. అప్పుడు మీకెవరూ చెప్పక్కర లేదు" అంటూ వెళ్ళిపోయింది.

కాఫీ తాగానో లేదో గుర్తులేదు. గబగబా గదిలోకి వెళ్ళిచిత్రాన్ని చూశాను. లోపాలు వుండే వుంటాయి. ఊహ నిజంకాదు. నిజాన్ని అందంగా చెప్పేదేకళ. గీతలు, రంగులు కళకాదు. రంగుల కలయికలో ఆర్భాటం వుండకూడదు.

ఒక గీత ఒకటికన్న ఎక్కువ ప్రయోజనాన్ని సాధించాలి. నిజాన్ని ఆవిష్కరించాలంటే నిజమే- నిజంగా మోడల్ కావలసిందే. కానీ మోడల్ని ఎక్కడనుండి తేను!

నాకు ఉద్యోగం లేదని పెళ్లయిన నాటినుండి పుట్టింటిలోనే వున్న శ్రీమతిని తిరిగి రప్పించటం నాకు సాధ్యంకాదు. నా ఆలోచనలతో ఎప్పుడో తెల్లరిపోయింది.

మాంగల్యధారణ అయిపోయింది. నేను క్రిందకి దిగి స్నానంచేసి తిరిగి వస్తూంటే "పదండి. పదండి. అరుంధతిని చూద్దురుగాని" అంటున్నాడు పెళ్ళి పెద్ద. సూర్యుడప్పుడే ఎర్రగా పైకి వచ్చేస్తున్నాడు.

"ఇప్పుడేం అరుంధతి"? అన్నాను పక్కవాళ్ళతో.

"శాస్త్రం. శాస్త్రం. ఏ దిక్కున వుంటుందో చూపించాలిగా". అంటూ వధూవరులతో పరుగెత్తాడు శాస్త్రులుగారు.

బట్టలు మార్చుకుని గదికి తాళంవేసి ఆర్టుగేలరీ వేపు వెళ్దామని బయలుదేరి-దారి మార్చుకుని కోటిపల్లి బస్సుస్టాండువేపు నడిచాను. ద్రాక్షారామం వెళ్ళేబస్సు సిద్ధంగా వుంది. బస్సెక్కేశాను. కథలు- కథలకి కథావస్తువులు - సమస్యలకు పరిష్కారాలు నాకు ప్రయాణాలలోనే లభ్యమవుతాయి. బస్సులో కిటికీపక్కన కూర్చునే నాకు బాహ్యప్రపంచం దగ్గరవుతుందని భావిస్తూంటాను.

ప్రస్తుతం నా సమస్యకి పరిష్కారం ఈ ప్రయాణం దోహదం చేయదు. టెన్షన్ నుండి దూరమవాలనేనా ప్రయత్నం. శ్రీనివాసులుగారికి చెప్పకుండా వచ్చేసిన నేను ద్రాక్షారామంలో రెండురోజులు గడిపేశాను. యానాంలో ఒకరోజు.

మూడురోజుల తరువాత తొలగిపోని టెన్షన్ తోనే తిరిగివచ్చాను. నేను తిరిగివచ్చేసరికి కల్యాణ మంటపం సందడిగా వుంది. అడుగుపెట్టేసరికి ఎదురొచ్చారు శ్రీనివాసులుగారు.

"చెప్పకుండా ఎక్కడికి వెళ్ళావు? నీకోసం ఒక రోజంతా చూశాను". అన్నారు.

చెప్పాను ద్రాక్షారామం వెళ్ళిన సంగతి.

"మీ కళాకారులు స్థిరంగా ఒకచోట వుండరు కదా. ఏమైనా స్కెచెస్ వేశావా?" అంటూ నా స్కెచ్ బుక్ తిరగేశారు.

నేను లేదంటూంటే- "సరే. రెస్టు తీసికో. ఈ రాత్రే పెళ్ళి. బయటికి వెళ్ళకు కాఫీ, టిఫిన్ పంపుతాను". అంటూ వెళ్ళిపోయారు.

నేను మేడమీదికి వెళ్ళక సత్రమంతా కలియ చూశాను ఆమెకోసం. ఎక్కడా కనిపించలేదు.వంటశాలవైపు వెళ్ళాను. అక్కడా లేదు. వంటవాళ్ళు కొత్తవాళ్ళు ఇద్దరు మగాళ్లు-ఒక స్త్రీ.

"ఇక్కడ వంటచేసే తల్లీకూతురు వుండాలి. ఏరి?" అడిగాను వాళ్ళని.

"అరుంధతికి పెళ్లిచూపులు కదా. రావులపాలెం వెళ్ళారు. రేపొద్దున్న వచ్చేస్తారు. ఏం పని? పెళ్ళా! వాళ్ళకు నాలుగురోజుల వరకు అవదు. మాకు చెప్పండి వస్తాం. శంకరమఠం దగ్గరే వుంటాం". అన్నారు వాళ్ళు.

ఆమెపేరు అరుంధతి అని తెలిసికున్నాను. "అలాగేలెండి" అని వచ్చేశాను కాఫీ,టిఫిన్ తీసికొని.

తలుపుతెరిచి లైటువేశాను. గడపదగ్గర నాలుగు మడతలుపడ్డ కాగితం

పడివుంది. 'ఏమిటై వుంటుందా?' అని తీసి చదివాను. అందులో ఏ సంబోధనా లేదు. ఇలావుంది-

'రెండురోజులై మీరు కనిపించలేదు. మోడల్‌ని తెచ్చుకోవటంకోసం వెళ్ళారని అనుకుంటాను. మీరూహించి చిత్రించినదైన చిత్రం అందంగా వుంది. ముగ్ధమోహనం గా వుంది.

మీరు తలుపుకు తాళం వేయకుండా వున్నప్పుడు మీరు లేని వేళలలో మీ చిత్రాల్ని చూచేదాన్ని దొంగతనంగా. అద్భుతంగా వున్నాయి. చూపులు చిరునగవుల మోములతో మోహనంగా. నిజానికి లోకంలో ఎక్కడా లేని అందంగా.

నాకే మోహం కలిగింది. అందుకే మీ చిత్రాలంటే మక్కువ. ఈ అందం ఎక్కడో వుంటుందనే ఆశ కలిగించాయి మీ చిత్రాలు. ఇప్పుడు మీరు చిత్రిస్తున్న చిత్రం విలక్షణంగా వుంది. ఇదే మీ మొదటి ప్రయత్నం అనుకుంటాను.

నాకో సందేహం. స్త్రీని అలా చిత్రిస్తే తప్ప కళను ఆవిష్కరించినట్టు కాదా! నీళ్ళబిందెను చంకన పెట్టుకున్న స్త్రీ, పిల్లాడికి పాలిచ్చే స్త్రీ అలాగే వుంటుందా? కొండల్ని, చెట్లుపుట్టల్ని చూచినట్టు స్త్రీని చూడగలమా? చిత్రకారులకు, శిల్పులకు ఆ దృష్టి వుంటుందంటారా? పైగ్మేలియన్ తను చెక్కిన చలువరాతి స్త్రీ విగ్రహాన్నే మోహించి తన పడకగదిలో పెట్టుకున్నాడట. మీరందుకు అతీతంగా వుండగలిగితే మీ చిత్రాన్ని చక్కగ పూర్తిచేసికోగలరు.

మంచి సౌష్టవం, అవయవ పుష్టి వున్న మోడల్ దొరికితే మీ ప్రయత్నం ఫలిస్తుంది. ఇందాకేదో అన్నాను. ఆ మాటలు పట్టించుకోకండి. చిత్రాన్ని పూర్తిచేయండి. నేను ఊరు వెళ్తున్నాను. ఎప్పుడు వస్తానో తెలియదు. వచ్చేసరికి మీరుంటారో లేదో తెలీదు. అందుకే ఈ ఉత్తరం రాస్తున్నాను. చిత్రాన్ని పూర్తిచేయండి. - మీ చిత్రాల అభిమానించే నేను' ఆ ఉత్తరం చదివి అలా వుండిపోయాను. ఆమె చెప్పాలనుకున్నది నిక్కచ్చిగా మోమాటం లేకుండా చెప్పింది. ఆ తీరు నాకు నచ్చింది.

ఇంతలో గదిలోకి శ్రీనివాసులుగారు వచ్చారు. "చిత్రం పూర్తయిందా"? అంటూ. జరిగింది చెప్పాను. ఉత్తరం చూపించాను. లోపం ఎక్కడో చెప్పమన్నాను.

"త్రిభంగిలో వేశావు. భంగిమ బాగానే వచ్చింది. లోపం నాకూ తెలియటంలేదు. నిజానికి మోడల్ లేకుండా ఏ చిత్రకారుడు ముందుకి వెళ్ళలేడు. దామెర్ల రామారావుకీ అతని భార్యే స్ఫూర్తియట. ఈ కవులు ఊహాసుందరులని అంటారు కానీ వారు ఆ అందాన్ని చూచినవారే అయ్యుంటారు. నీవు ప్రయత్నం చేయి". అంటూ నవ్వారు.

"ఇంతకీ ఈమె ఎక్కడికెళ్లింది?" అడిగాను.

"నీకు చెప్పలేదుకదూ! నీ అభిమానికి పెళ్ళి చూపులు. రావులపాలెంలోనో- విజయవాడలోనో- పిన్నతల్లి ఇంట్లో- పెళ్లికొడుకు చాలా బిజీమనిషి, తీరిక దొరకదతనికి - పెళ్ళిళ్ళు చేయిస్తూంటాడు. వయసెంతో తెలుసా నాకన్న అయిదేళ్లు చిన్న. ఏభైఏళ్ళే- పాతికేళ్ళు కూడా లేని పిల్లకి ఏభైఏళ్ళ భర్తేవిటంటావు? ఏం చెప్పమంటావు? తండ్రి

వేదాలు చదువుకున్నవాడే. పండితుడే. కానీ తాగుబోతు. పైస సంపాదన లేని అప్రయోజకుడు. అతనికి ఇద్దరుకొడుకులు- పెళ్ళిళ్ళయ్యాయి. వారి సంపాదన వారికే చాలదు. కుటుంబాన్ని ఆదుకునే శక్తి వారికి లేదు. తల్లీకూతురు-వంటలు చేసి సంసారాన్ని లాక్కొస్తున్నారు. వారికి పాడు పడిన ఇల్లు తప్ప మరేమీ లేదు. ఇప్పుడీ పెళ్ళికొడుకు ఎదురు పదివేలిస్తానన్నాడట. ఇంటిమీద చేసిన పదివేలు అప్పుతీర్చేస్తానన్నాడట. ఇది అతనికి 4వ పెళ్ళి. మొదటామె పురిటిలో పోయింది. రెండోభార్య లేచిపోయింది. మూడో బార్య ఉరిపోసుకు చనిపోయింది. ఇప్పుడీమె పెళ్ళయితే నాల్గవభార్య''.

''ఈ పెళ్లి తనకు ఇష్టమా? చదువుకుందికదా. ఇంతో అంతో సంపాదించుకో గలదుకదా!''

''అయినా పెళ్ళి అంటూ స్త్రీ పురుషులకి అవసరం కదా. ఇప్పుడీ పెళ్ళయితే ఇంటిమీద అప్పు తీరుతుంది- స్త్రీ- ఎంత చదువుకున్నా ఎవరికి కావాలి? పెరిగిపోతున్న కట్నకానుకల వేలంపాటలో పేదపిల్లకి పెళ్ళి సాధ్యమేనా? మనుషుల మధ్య వుండాల్సినది పోతోంది. పోవాల్సింది వుండిపోతున్నది. చిత్రం పూర్తిచెయ్యి నే వస్తా. ఆలోచనలో పడి భోజనం మరువకు''. అని వెళ్ళిపోయారు.

నాకారాత్రంతా నిద్ర లేదు. ఉదయం లేచేసరికి పెళ్ళివారు వెళ్ళిపోయారు. కొత్తబ్యాచి 9గంటలకి వచ్చింది. నేను అరుంధతి కోసం ఎదురుచూస్తూ 12 గంటల వరకు గడిపి గదినుండి బయటపడ్డాను. ఆర్టు గ్యేలరీ వైపు వెళ్లాలనిపించలేదు. ఆ వేసవి ఎండలో గోదావరి ఒడ్డునుండి రైలు స్టేషన్‌దాక తిరిగితిరిగి రాత్రి 8 గంటలకి సత్రం చేరాను.

ఎదురొచ్చిన శ్రీనివాసులుగారు చెప్పారు- ''నీ అభిమాని వచ్చింది. ఎల్లుండి ఉదయం పెళ్ళి - రేపు పెళ్ళికూతుర్ని చేస్తారు. పెళ్ళికొడుకు రేపు రాత్రి జరగబోయే పెళ్ళికి పురోహితుడు. ఇంత వరకు ఇక్కడే ఎక్కడో వుండాలి. ఉండు చూసిస్తాను'' అంటూ తీసికెళ్లారు.

అరుంధతి కనిపిస్తుందని అతని వెంటవెళ్ళాను. ''అదుగో! ఉన్నాడు. అతనే పెళ్లికొడుకు'' అంటూ చూపించారు. చూశాను.

పొగాకు కాడలా, వంగిన కావిడిబద్దలా వున్నాడు. గుంటకళ్ళు, పొడుగుముక్కు మెడలో రుద్రాక్షలు. పార్వతమ్మతో ఏదో గట్టిగ మాటాడుతున్నాడు.

''ఇంతకన్నా ఎక్కువ ఎవరేమివ్వగలరు? అనవసరంగా అత్యాశకు పోకు. పాతికవేలు కావాలట పాతికవేలు!'' అంటూ భుజంమీది తుండుగుడ్డను ఒకసారి జాడించాడు. అక్కడ నాకు నిలవబుద్ధి పుట్టలేదు. అరుంధతి కనిపించలేదు. శ్రీనివాసులుగారి బలవంతంమీద భోజనం అయిందనిపించాను.

రాత్రి 12 గంటలప్పుడు తలుపు తట్టిన శబ్దం. ఒక్క ఉదుటున లేచి తలుపు తీశాను. క్రింద పెళ్ళిసందడి. ఎదురుగా అరుంధతి.

వాడిపోయిన ముఖంతో తలుపు తీసిన వెంటనే లోపలికి జొరబడింది.

"తలుపు వేసేయండి. లైటు తీసేయండి. నేను ఎవరికి కనపడకుండా వచ్చాను. ఎల్లుండి ఉదయమే నా పెళ్ళి-నాకిష్టంలేదు. నేను పాడకూడదు - నాట్యం చేయకూడదు. సామిదమ్మలా వంటింటిలో పడివుండాలట- అసలు ఈ పెళ్ళే నాకిష్టం లేదు. డబ్బుకోసం నన్ను కట్టబెట్టాలని చూస్తున్నారు. మీ చిత్రం పూర్తవలేదుకదూ. నేను మళ్ళీ వస్తాను. రేపంతా ఎక్కడికీ వెళ్ళకండి". అంటూ తలుపు తీసికొని అటుఇటు చూచుకుని మెట్లు దిగి వెళ్ళి పోయింది. భారంగా తెల్లవారింది.

ఉదయం అరుంధతిని పెళ్ళికూతుర్ని చేశారు. కల్యాణతిలకంతో అరుంధతి-బలికి వెళ్ళబోయే మేకపిల్లలా. ముత్తయిదువులు మంగళహారతి పాడు తూంటే మేడమీదికి వచ్చేశాను. ఎక్కడికో పారిపోవాలనిపించింది. కానీ ఎక్కడికీ వెళ్లవద్దంది అరుంధతి.

మధ్యాహ్నవేళకి ఓ అరడజను మంది మగపెళ్లి వారు దిగారు. బోజనాలయి పోగానే ఎవరికో పెళ్ళి చేయించి ఉదయానికి- ముహూర్తం వేళకి వస్తానంటూ వెళ్ళిపోయాడు పెళ్లికొడుకు.

ఉదయం తొమ్మిదిగంటలకు కదా పెళ్లి. ఏ ఆర్భాటం లేదు. ఏదో అయిందని పించేటట్టున్నారు. రాత్రి జరగబోయే పెళ్ళికోసం వచ్చిన పెళ్లివారితో అంతా సందడిగా వుంది. కాసేపు గోదారొడ్డుకి పోయొద్దామని నాలుగ్గంటలకి తలుపు తాళం వేయబోతూంటే మెరుపులా వచ్చింది అరుంధతి తలుపు తోసుకుని లోపలికి.

లోపలికి వచ్చి "తలుపులు వేసేయండి. కిటికీ తలుపులుకూడా". అంటూ ఆ పని తానే చేసేసింది. గదిలో లైటు వేయబోతూంటే ఆపింది.

కిటికీ సందుల్లోంచి వచ్చే వెలుగులో అరుంధతి నాకు కనిపిస్తోంది.

"మంచినీళ్ళున్నాయా! కొద్దిగ ఇవ్వండి". అంది. కూజాలోంచి మంచీ నీళ్ళు గ్లాసులో పోసి ఇచ్చాను. తాగింది. అప్పుడు చూశాను.

నుదుటి మీద చిరుచెమట. చెమటలో అతుక్కు పోయిన ముంగురులు-చెమటలో తడిసిన కల్యాణ తిలకం - కళ్ళలో కరిగే కాటుక-బుగ్గన చుక్క - కళ్ళలో దీనత్వం. గ్లాసు టేబిలుమీద పెడుతూ "ఈ రాత్రంతా ఇక్కడేవుంటాను. చిత్రం పూర్తిచేసి కోండి". అంది నెమ్మదిగా.

"అంటే?"

"నాకీ పెళ్ళి ఇష్టంలేదు. గోదావరిలో పడి చావాలనుకుంటున్నాను. చనిపోయే ముందు మీకు ఉపయోగపడాలని నా ఉద్దేశ్యం. రేపు నే చచ్చినతరువాత అందరూ నా శరీరాన్ని అంగుళం అంగుళం చూస్తారుగా. ఇక దాచేదేముంది? మీరు సంశయించ కండి. ఇంకా వ్యవధివుంటే నా చిత్రాన్నే పూర్తిగ గీయించుకుని చచ్చేదాన్ని". అంది భుజంమీద చేయి వేసికొని.

"నీవేమి మాటాడుతున్నావో నీకు తెలుసా"? అన్నాను కొద్దిగ గట్టిగ.

"తెలుసు. చచ్చిపోయేముందు మీకీ రకంగా నైనా ఉపయోగపడాలని నా ఉద్దేశం. ఇదే చివరి రాత్రి నాకు. అందుకే చిత్రం పూర్తిచేసికోండి. మీ ముందు ఎలానిలబడమన్నా నిలబడతాను". అంది భుజంమీద నున్న పైటపిన్నుమీద చేయివేసికుని.

"చావడమెందుకు? పెళ్ళి ఇష్టంలేదని చెప్పు. ఆ మాట చెప్పలేవూ!"

"చెప్పాను. తప్పదంటే చస్తానని చెప్పాను. శవానికైన పెళ్ళిచేస్తానన్నాడు నాన్న. అన్నలు మాటాడలేదు. అమ్మ నాన్నను ఎదిరించలేదు. ఇక బ్రతకటమెందుకు? చచ్చేముందు మీకైనా ఉపయోగపడనివ్వండి". అంది.

"నా చిత్రం గురించి ఆలోచించకు. చావు గురించీ ఆలోచించకు".

ఇంతలో క్రింద ఏదో కలకలం. ఏవో అరుపులు.

"అది మా నాన్న గొంతే! నేను కలిపించలేదని కాబోలు. ఇక్కడికి కూడా వెతుకుతువస్తారేమో. అవును నా గురించే ఆ కేకలు". కంగారుపడసాగింది అరుంధతి.

"నీవేమీ కంగారుపడకు. పారిపోయావనే వాళ్ళని అనుకోనీయి. నీవు లోపలే వుండు. నేను బయట తాళం వేస్తాను. సద్దుమణగిన తరువాత నీవు ఏం చేయాలో చెప్తాను". అంటూ తలుపులువేసి బయట తాళం వేసి క్రిందికి దిగాను.

"అరుంధతి కనిపించిందా? అరుంధతి కనిపించిందా? ఏది అరుంధతి...?" అంటూ అందరు అటుఇటు హడావుడిగా పరుగెడుతూంటే, శ్రీనివాసులుగారు ఎదురుపడి- "అరుంధతి కనిపించిందా? అరుంధతి" అన్నాడు.

"పగటివేళ అరుంధతి ఏమిటి?" అన్నాను అమాయకంగా.

"పార్వతమ్మ కూతురయ్యా!నీ అభిమాని, ఆమె పేరు అరుంధతి. ఈ పెళ్ళి ఇష్టంలేదందట. చేస్తామంటే చస్తానందిట. ఎక్కడికెళ్ళిందో అని కంగారు పడుతున్నారు. అరుంధతి చచ్చిపోతే తమ అప్పులు తీరవని అందరూ కంగారుపడుతున్నారు" నేను స్వేచ్ఛగా ఊపిరి తీసికున్నాను.

పైన మేడమీద ఉంటుందేమో అని వెళ్ళినవాళ్ళు తిరిగొచ్చారు. కొందరు గోదావరొడ్డుకు పరుగెత్తారు. రాత్రి పెళ్ళివాళ్ళు వాళ్ళ సందడిలో వాళ్ళున్నారు.

ఏడుగంటల ప్రాంతంలో కొంత సద్దుమణిగింది. నేను నెమ్మదిగ తాళంతీసి లోపలికి వెళ్ళాను. ఉక్కపోస్తున్న గదిలో దీపం వేశాను.

"దీపం తీసేయండి. బట్టలు కట్టుకుంటున్నాను". అంది అరుంధతి నిలువుటద్దం వెనుక నుండి. స్టాండుమీదుండే నిలువుటద్దం గదిమధ్యలో కేన్వాస్ ముందుకొచ్చింది. నేను లైటార్పి తలుపు దగ్గరకేసి బయటకు వచ్చి నిలబడ్డాను.

"రండి". అంది మెల్లగా.

నేను లోపలికి వెళ్ళి గడియ వేశాను. ఆమే దీపం వేసింది. "చూడండి మీ చిత్రం". అంది. ఆమె చేతికి అక్కడక్కడ రంగులు. రంగుల్లో ముంచిన కుంచె.

చూశాను.

"చూశారా ఈ గీత కొంత పొడవుగా రావాలి... ఈ గీత కొద్దిగా వంగాలి క్రిందికి. కొద్దిగ పక్కకి వంగి నిల్చున్న ఈ రకమైన భంగిమలో అవయవాల్లో తేడాలుంటాయి. ఇక్కడ కొద్దిగ పైకి, అది కొంత దిగువకి రావాలి. రంగులు కలపటం నాకు బాగ తెలియదు. అది మీరే చేయాలి.

పొట్టమీద మడత ఇంత పొడవుగా రాదు. దాని క్రింద కొద్దిగా పొట్టి మడత వుంటుంది. మీరు శిల్పాలలో చూచేవుంటారు. నాభిదగ్గర..." అంటూ చేతిలో చూపిస్తూ తాను చేసిన మార్పులను, నేను చేయాల్సిన మార్పులను నిర్లజ్జగా వివరించింది.

నేను ఆమెవైపు కృతజ్ఞతగా చూస్తూ "చాలా థాంక్సు. మిగిలిన మార్పులు నేను చేసికొంటాను. నా చిత్రాన్ని దిద్ది నాకు సహాయపడ్డావు. నీకు నేను సహాయంచేస్తాను. చెప్పు. నీకే సహాయంకావాలి?" అడిగాను.

"నాకీ పెళ్లివద్దు. నేను స్వతంత్రంగా బ్రతకాలి. చెప్పండి. ఏంచేస్తారో?" అంది.

నా దగ్గరున్న డబ్బంతా ఆమెచేతిలో పెట్టాను. కరంటు కట్ అయ్యేటైము కోసం ఎదురుచూశాం. కరంటు పోగానే క్రిందికి దిగివచ్చాము. గబగబా బయటపడి, చీకటినీడల్లో వీధిమలుపువరకు  నడచి రైలు స్టేషనుకు రిక్షా ఎక్కేశాము.

ఏలూరులో నా మిత్రుడి చిరునామా-వివరాలు- అన్నీ ఆమెకు  చాలా అర్థమయ్యేటట్టు చెప్పాను. అతడు లేకపోతే ఎక్కడికెళ్ళాలో చెప్పాను. మా ఊరికి జరిగింది ఉత్తరం రాయమని ఎడ్రెస్ ఇచ్చాను. ఎక్స్‌ప్రెస్ ట్రైనేదో వెళ్లడానికి సిద్ధంగా వుంటే ఎక్కించేశాను. తోడుగ ఒక వృద్ధ దంపతులు దొరికారు. నిబ్బరంగా వెనుతిరిగాను. నేను సత్రం చేరేసరికి పదకొండయింది.

"అదుగోవచ్చాడు. వాడినడగండి". అని ఇద్దరు ముగ్గురంటూంటే చాలామంది నా చుట్టూచేరారు.

"అరుంధతి ఎక్కడ? దాన్నేం చేశావు. చెప్పు లేకపోతే ప్రాణాలు తీస్తాము". అంటూ నామీదకొచ్చారిద్దరు. నాకు తెలియదన్నాను నిబ్బరంగా.

"తెలియదూ! దానితో మాటాడటం రెండు మూడుసార్లు ఇక్కడివాళ్ళు చూశారు. చెప్పు. దాని నేం చేశావు?" అంటూ, శ్రీనివాసులుగారు వారిస్తున్నా ఒకడు నా కాలరు పట్టుకుని పొట్టలో తంతూండగా ఇద్దరు నా చేతులు విరిచి పట్టుకున్నారు. వెనుకనుండి ముందునుండి పిడిగుద్దులు గుద్దుతూంటే నాకు తెలియదని అన్నాను.

"నాకు కాబోయే భార్యని లేపుకుపోతావుట్రా త్రాష్టుడా!" అంటూ పెళ్ళికొడుకు నా తలమీద తన చేతికర్రతో బలంగా కొట్టాడు. ఎవరూ ఊహించివుండరతనలా చేస్తాడని.

"అమ్మో!" అంటూ నే నేలవాలిపోవటం నాకు తెలుసు. తలకు గట్టిగ దెబ్బ తగిలిందట. శ్రీనివాసులుగారే హాస్పిటల్‌లో చేర్పించారట.

రెండురోజులకు గాని నాకు స్పృహ రాలేదు. మా ఇద్దరన్నయ్యలూ వచ్చేశారు.

రక్తం ఇచ్చారట నాకు. తలకు బాగా కుట్లు పడ్డాయట.

వారంరోజుల తరువాత మా అన్నయ్యలు మా ఊరు తీసికొచ్చేశారు. ఇంట్లో ఎవరూ నన్నేమన లేదు కానీ మా చిన్నొదినే-'ఏదో ఘనకార్యం చేశావుట కదా!'' అంది మూతివిరుస్తూ.

మా మావగారు హడావుడిగా తన కూతుర్ని వెంటబెట్టుకుని వచ్చి దిగబెట్టి వెళ్ళిపోయాడు.

''మీరా అమ్మాయిని లేపుకుపోయారా! అందరూతలో రకంగా అన్నారట. ఎందుకీబొమ్మలు- ఈ రాతలు? ఉద్యోగం చేసికోండి''. అంది శ్రీమతి.

వేసవి గడవగానే డ్రాయింగుమాష్టరు ఉద్యోగం వేయించారు నాన్నగారు.

ఒకరోజు జరిగింది శ్రీమతికి చెప్పేశాను.

''అయ్యో! పాపం ఆ పిల్ల ఏమైందో ఉత్తరం రాయండి'' అంది.

నేను ఏలూరుకు ఉత్తరాలు రాశాను. ఒకటి కాదు నాలుగు. వేటికీ సమాధానం రాలేదు.

ఏలూరు వెళ్ళటం నాకూ అవలేదు. కానీ ఒక ఆశ అరుంధతి బతికే వుంటుందని.

ఆమె గురించి తెలుసుకోవడంకోసమే ఈ పదిసంవత్సరాల తరువాత రాజమండ్రి - ఆ సత్రంకే రావటం.

పెళ్ళయిన మర్నాడు శ్రీనివాసులుగార్ని వెతుక్కుంటూ దానవాయిపేట వెళ్ళాను. వెళ్ళగానే 'అరుంధతి' గురించి అడిగాను.

''నాకు పూర్తిగా తెలియదు. అమరావతిలో వుంటుందంటారు. నాట్యప్రదర్శన లిస్తోందిట. డాన్సు స్కూలు నడుపుతోందిట. తల్లికి డబ్బు పంపించింది పదివేలు అప్పుతీర్చమని. ఓ రోజు నేను లేనప్పుడు వచ్చి మీ అన్నలు వదిలేసిన నీ చిత్రాల్ని తీసికెళ్లి పోయింది. పెద్దపెద్ద నగరాల్లో ప్రదర్శనలిస్తోందిట. ఇక్కడికి మాత్రం రాలే. నే కలవాలని చాలా ప్రయత్నించా. కాని కలియలేకపోయాను.'' అన్నారు.

నేను ఎడ్రస్ తీసికొని అమరావతి వెళ్ళి నిరాశతో తిరిగివచ్చాను.

నా ఆశమాత్రం చావలేదు. అరుంధతి కనిపిస్తుందని- జరిగిన కథ చెప్తుందని ఆశ. ఆ క్షణం కోసమే నా నిరీక్షణ.

* * *